ఆలయ ధర్మకర్త పదవికి ఆహ్వానం


ఈవో శ్రీనివాస్

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, శంబరపోలమాంబ అమ్మవారి ఆలయ ధర్మకర్త పదవికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈవో బి.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఈవో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని శంబర గ్రామంలో కొలువైన శంబరపోలమాంబ అమ్మవారి దేవస్థానం ధర్మకర్త పదవికి ఆంధ్రప్రదేశ్ ధార్మిక పరిషత్ విజయవాడ వారి ఉత్తర్వుల ప్రకారం వంశపారంపరేతర ధర్మకర్త పదవికి దరఖాస్తులు కోరుతున్నామని తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు 10రోజుల్లోగా దేవాలయ కార్యాలయంలో కార్యనిర్వాహణాధికారికి దరఖాస్తులు సమర్పించాలని ఈవో కోరారు.

17,18 తేదీల్లో భారీ వర్ష సూచన

పార్వతీపురం రూరల్: ఈనెల 17, 18 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాతావరణ శాఖ సూచనల మేరకు కొన్ని ప్రాంతాల్లో పైన తెలిపిన తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున తదనుగుణంగా అధికారులు, ప్రజలు అప్రమత్తం కావాలని పిలుపునిచ్చారు.

న్యూస్‌రీల్

ఎలిఫెంట్ డే పోస్టర్ ఆవిష్కరణ


అటవీశాఖాధికారులతో కలిసి వరల్డ్ ఎలిఫెంట్‌డే పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం రూరల్: ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, జిల్లా అటవీశాఖాధికారి ప్రసూనతో కలిసి వరల్డ్ ఎలిఫెండ్ డే పోస్టర్లను మంగళవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో ఏనుగుల పర్యవేక్షణ అధికారి మణికంఠేష్, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ ఎం.మనోజ్ కుమార్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పాత మార్కొండపుట్టిలో గజరాజులు


పాతమార్కొండ పుట్టిలో పత్తి పంటలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

కొమరాడ: తోటపల్లి ముంపు ప్రాంతమైన పాత మార్కొండపుట్టి గ్రామ పరిసరాల్లో మంగళవారం ఏనుగులు సంచరించాయి. వరి, పత్తి, కూరగాయలు, అరటి పంటలను నష్టపరుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఎరువుల బాధ్యత ఏఓలదే

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖాధికారులపై ఉందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ స్పష్టం చేశారు. జిల్లాలో అవసరమైన పరిమాణంలో ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎరువుల పర్యవేక్షణపై జాయింట్ కలెక్టర్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల కొరతపై ఎలాంటి ఆందోళన అవసరం లేదన్న విషయం రైతులకు వివరించాలన్నారు. మండలాల వారీగా అధికారులు పర్యవేక్షించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎరువుల దుకాణాలపై పటిష్ట పర్యవేక్షణ ఉండాలని, కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించిన చర్యలు తీసుకుని అవసరమైతే సీజ్‌చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలే లక్ష్యం

- సబ్‌కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్



పాలకొండ: ప్రజలకు రెవెన్యూ సేవలు సక్రమంగా అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని సబ్‌కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ తెలిపారు. పాలకొండ సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన 'సాక్షి'తో మంగళవారం మాట్లాడారు. సివిల్స్ శిక్షణ అనంతరం మొదటిసారిగా ఇక్కడ బాధ్యతలు చేపట్టినట్టు వెల్లడించారు. రెవెన్యూ వ్యవస్థపై పూర్తి అవగాహన పెంచుకుని ప్రజలకు మంచి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

చదువులో ప్రతిభ చూపుతూ...

స్వప్నిల్ జగన్నాథ్‌ది మహారాష్ట్రలోని నాసిక్. సామాన్య కుటుంబం. తండ్రి జగన్నాథ్ పవార్ ఆటోడ్రైవర్. తల్లి కల్పన గృహిణి. సోదరి పూజకు వివాహం అయింది. పూనేలో కెమికల్ ఇంజినీరింగ్ పూర్తిచేసిన స్వప్నిల్ చదువులో రాణిస్తూ మొదటి ప్రయత్నంలోనే ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యారు. రెండో ప్రయత్నంలో ఐపీఎస్, మూడో ప్రయత్నంలో ఐఏఎస్ సాధించారు. 2023 ఐఏఎస్ బ్యాచ్‌లో ఆయన శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఇదే బ్యాచ్‌కు చెందిన వైశాలిని 2025లో వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం ఆమె పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా విధుల్లో చేరారు.

డీఎస్సీలో రాణించిన తాళ్లడుమ్మ యువకుడు


దుర్గాప్రసాదరావు

జియ్యమ్మవలస: మండలంలోని తాళ్లడుమ్మ గ్రామానికి చెందిన తుమరాడ దుర్గాప్రసాదరావు స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)లో 89.62 మార్కులు సాధించాడు. పీజీటీ (తెలుగు)లో 84.5, టీజీటీ (తెలుగు) 77.67 మార్కులు వచ్చాయి. డీఎస్సీలో కుమారుడు ప్రతిభ చూపడంతో తల్లిదండ్రులు పద్మావతి, వెంకటరమణ సంతోషపడుతున్నారు.

ఉచిత ప్రయాణం.. పరిమితమే!



- కొన్ని సర్వీసులకే అవకాశం
- అదనపు బస్సులు నడపకుంటే కష్టమే..

సాక్షి, పార్వతీపురం మన్యం:

కూటమి ప్రభుత్వం ఈ నెల 15 నుంచి ప్రారంభించనున్న స్త్రీ శక్తి పథకం ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు పరిమితంగానే లబ్ధి కలిగించనుంది. కేవలం పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సులకు మాత్రమే వర్తించనుంది. దీనికితోడు.. జిల్లా నుంచి అటు పాలకొండ, ఇటు సాలూరు, కురుపాం, గుమ్మలక్ష్మీపురం వైపు మార్గాల్లో అధిక శాతం పల్లె వెలుగులే ఉన్నాయి. విజయనగరం వెళ్లే ఎక్స్ ప్రెస్ సర్వీసులు కూడా తక్కువే. దీంతోపాటు చాలా మారుమూల, ఏజెన్సీ ప్రాంతాలకు బస్సులే నడవవు. ఉన్నా కూడా.. కేవలం నిర్దిష్ట సమయంలోనే. దీంతో చాలా మంది ప్రయాణికులు ఆటోలనే ఆశ్రయిస్తున్నారు. ఈ రూట్లలో ఉచిత ప్రయాణం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. విశాఖ వంటి ప్రాంతాలకు వెళ్లాలనుకునేవారు దాదాపుగా డీలక్స్ బస్సులనే ఆశ్రయిస్తారు. పల్లె వెలుగు ఎక్కితే.. విజయనగరానికే 3.30 గంటల సమయం పడుతుంది. మధ్యలో వంతెనల దగ్గర ట్రాఫిక్ జామ్, మానాపురం గేటు వంటివి పడితే వెళ్లే సమయాన్ని అంచనా వేయడం కష్టమే. అందుకే చాలా మంది ప్రయాణికులు ఈ మార్గంలో రైళ్లనే ఆశ్రయిస్తుంటారు.

పార్వతీపురం, సాలూరు, పాలకొండ డిపోల పరిధిలో నిత్యం 60 వేల మందికిపైగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇందులో ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రయాణిస్తున్న మహిళలు 30 వేల మందికిపైగా ఉంటారని అంచనా. ప్రస్తుతం జిల్లాలో సూపర్ లగ్జరీ 10, అల్ట్రా డీలక్స్ 54, ఎక్స్ ప్రెస్ సరీ్వసులు 45, అల్ట్రా పల్లె వెలుగు 33, పల్లె వెలుగు 203 బస్సులు చొప్పున ఉన్నాయి. పథకం అమలు కోసం 200 వరకూ సర్వీసులను కేటాయించినట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. మారుమూల గ్రామాలకు వెళ్లే వాటిలో కాలం చెల్లిన బస్సులే అధికం. ఉచిత ప్రయాణం వల్ల ప్రయాణికుల రద్దీ పెరిగితే.. వీటి సామర్థ్యం సరిపోతుందా? అని ఉద్యోగులు సంశయిస్తున్నారు.

ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ

పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, విజయనగరం మార్గాల్లో నిత్యం వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రధానంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో రద్దీ అధికంగా ఉంటుంది. నిల్చొని ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి. కొన్ని మార్గాల్లో చాలా సమయం వేచి చూస్తేనే గానీ.. బస్సు ఎక్కలేని, సీటు దొరకని సందర్భాలు ఉంటాయి. ఉచిత ప్రయాణం ప్రారంభమయ్యాక ఈ పరిస్థితి మరింత అధికంగా ఉంటుంది. దీనివల్ల టికెట్ తీసుకుని ప్రయాణించే సామాన్య ప్రయాణికులకు బస్సులు అందుబాటులో ఉండటం కష్టమే. అదనపు సర్వీసులను నడిపితేనే గానీ.. రద్దీని నియంత్రించలేమని ఉద్యోగులు అంటున్నారు.

టాయిలెట్‌లో కింగ్ కోబ్రా




కురుపాం మండలం కిచ్చాడ గ్రామంలోని ఆగూరు శివ ఇంటి పెరటిలోని టాయిలెట్ గదిలో సుమారు పది అడుగుల కింగ్ కోబ్రా దూరింది. దీనిని చూసిన శివ కుటుంబ సభ్యులు భయాందోళన చెందారు. కురుపాం అటవీశాఖ రేంజర్ గంగరాజుకు సమాచారం ఇచ్చారు. ఆయన విజయనగరానికి చెందిన స్నేక్ కేచర్స్‌ను పిలిపించి పట్టించారు. అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

– గుమ్మలక్ష్మీపురం(కురుపాం)

ఏటీఎంలో చోరీకి యత్నించిన నిందితుడి అరెస్ట్

పాచిపెంట: మండల కేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బయటగల ఏటీఎంలో శనివారం అర్ధరాత్రి చోరీకి ప్రయత్నించి పరారైన నిందితుడిని మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై వెంకట సురేష్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఎజ్జల గౌరీష్‌ను నిందితుడిగా గుర్తించి అరెస్ట్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితుడు చోరీకి యత్నించిన రోజు తనతో పాటు పట్టుకెళ్లిపోయిన రెండు సీసీ కెమెరాలు కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలను తప్పక తీసుకోవాలి


ఆల్బెండజోల్ మాత్రను విద్యార్థితో మింగిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్: చేతులను సబ్బుతో శుభ్రం చేసుకుని ఆహారాన్ని తీసుకోవడం వల్ల నులిపురుగుల నుంచి రక్షణ పొందవచ్చని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఆహార పదార్థాలు తీసుకునే ముందు, తరువాత శుభ్రం చేసుకోవడం అలవాటుగా మారాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగుల దినోత్సవ కార్యక్రమం స్థానిక డీవీఎం పాఠశాలలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగుల సంక్రమణ వల్ల రక్తహీనత, పోషక లోపం, ఆకలి మందగించడం, కడుపునొప్పి, వాంతులు, వికారం, విరేచనాలు, బరువు తగ్గడం వంటి సమస్యలు ప్రబలుతాయన్నారు. అందుకే వాటిని పూర్తిగా నిర్మూలించేందుకు ఆల్బెండజోల్ మాత్రలను తప్పక తీసుకోవాలని సూచించారు. డీ-వార్మింగ్ డే సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలను కలెక్టర్ విద్యార్థులతో నమిలి మింగించారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాల, కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని, ఈ రోజు వేసుకోలేనివారికి ఈనెల 20న మాప్‌అప్ కార్యక్రమంలో మాత్రలు వేయాలని ఆదేశించారు. రక్తహీనతగా గుర్తించిన కిశోరీ బాలికలకు ప్రతి రోజూ ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేయించాలని వైద్యాధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్.భాస్కరరావు, ఆర్‌బీఎస్‌కె పీఓ డా.టి. జగన్‌మోహన్‌రావు, డీఐఓ బి.రాజ్ కుమార్, స్టేట్ కన్సల్టెంట్ డా.కె.కిరణ్ నాయక్, ప్రోగ్రాం అధికారులు డా.రఘు, డా. వినోద్, డా.కౌశిక్, వైద్యాధికారి డా.లావణ్య, హెచ్ఎం శ్రీధర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్లకు అనువైన ప్రాంతాలను పరిశీలించాలి

పార్వతీపురం రూరల్: జిల్లాలో జియో, బీఎస్ఎన్ఎల్ ద్వారా ఏర్పాటు చేయబోయే 4జీ సెల్‌టవర్లకు గుర్తించిన అనువైన ప్రాంతాలను పునఃపరిశీలించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను మంగళవారం ఆదేశించారు. ఈ మేరకు ఆయన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, సర్వీసు ప్రొవైడర్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ టవర్ల ఏర్పాటుపై అధికారులు బృందంగా ఏర్పడి అనుకూల పరిస్థితులపై అధ్యయనం చేసి నివేదిక అందించాలని సూచించారు. ప్రస్తుతం అన్ని పనులు ఇంటర్‌నెట్, ఫోన్‌తో ముడిపడి ఉన్న తరుణంలో సెల్‌టవర్ల వినియోగం తప్పనిసరి అని స్పష్టం చేశారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పి.ధర్మచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ, బీఎస్ఎన్ఎల్, జియో సర్వీస్ ప్రొవైడర్లు పాల్గొన్నారు.

పరీక్షలు ఉపాధ్యాయులకా? విద్యార్థులకా?

- పరీక్షల సంస్కరణ పేరిట మూల్యాంకనం పుస్తకాల పంపిణీ
- సమయం సరిపోదంటున్న ఉపాధ్యాయులు


విద్యార్థులకు పరీక్షల వేళ అందజేస్తున్న మూల్యాంకనం పుస్తకాలు

వీరఘట్టం: కూటమి ప్రభుత్వం అడ్డగోలు నిర్ణయాలు విద్యారంగాన్ని అస్తవ్యస్తంగా మారుస్తున్నాయన్న వాదన వినిపిస్తోంది. ఇప్పటికే క్లస్టర్ విధానం, పాఠశాలల విలీనంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు గుర్రుగా ఉన్నారు. చాలాచోట్ల నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా పరీక్షల్లో అసెస్‌మెంట్ పుస్తకాల విధానం అటు విద్యార్థులు, ఇటు గురువులను అయోమయానికి గురిచేస్తోంది. మూల్యాంకన భారం గురువులపై పడుతుండగా, విద్యార్థులు గతంలో రాసిన సమాధానాలే మళ్లీ చూసి రాసేలా తెచ్చిన విధానంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇంతకూ ఈ పరీక్షలు ఉపాధ్యాయులుకా? లేదంటే విద్యార్థులకా? అంటూ ఉపాధ్యాయ వర్గాలు ప్రభుత్వం తీరును దుయ్యబడుతున్నాయి. గతంలో పరీక్షల సమయంలో కాగితాలపై జవాబులు రాస్తే ఉపాధ్యాయులు ఇంటికి తీసుకెళ్లి దిద్దేవారు. ఇప్పుడు మూల్యాంకన పుస్తకాలను విద్యార్థులకు అందించారు.

ఇదీ పరిస్థితి....

జిల్లాలో 1504 సర్కారు బడులు ఉన్నాయి. వీటిలో ఈ ఏడాది సుమారు 62 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థి అభ్యసన మదింపు కోసం ఏటా ఫార్మేటివ్, సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను నిర్వహిస్తారు. ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను గతేడాది నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్ 1,2,3,4గా నిర్ణయించారు. 2025–26 విద్యా సంవత్సరంలో నాలుగు సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు, రెండు సమ్మేటివ్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. మొదటి పరీక్షను ఈనెల 11న నిర్వహించారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం జూన్ 12న పాఠశాలలు ప్రారంభమయ్యాయి. వాస్తవానికి ఈ పరీక్షలు ఈ నెల 4వ తేదీ నుంచి జరగాల్సి ఉంది. అసెస్‌మెంట్ బుక్ లెట్స్ పాఠశాలలకు చేరుకోవడం ఆలస్యం కావడంతో సోమవారం నుంచి నిర్వహిస్తున్నారు. జూన్, జూలై సిలబస్‌కు సంబంధించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై పరీక్షలు పెట్టారు.

ఏడాది మొత్తం ఇవే పుస్తకాల్లో సమాధానాలు రాయాలి

సర్కారు బడుల్లో నిర్వహించే త్రైమాసిక, అర్ధవార్షిక, వార్షిక పరీక్షలను ఎఫ్ఏ–1,2,3,4లుగా, ఎస్ఏ–1,2లుగా నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలను విద్యార్థులు మూల్యాంకన పుస్తకాలలో రాసేందుకు వీలుగా 1, 2వ తరగతులకు మూడు పుస్తకాలు, 3, 4, 5 తరగతులకు నాలుగు పుస్తకాలు చొప్పున, 6, 7వ తరగతులకు ఆరు పుస్తకాల చొప్పున, 8, 9,10వ తరగతులకు ఏడు పుస్తకాల చొప్పున అందజేశారు. ఏడాదిలో జరిగే అన్ని పరీక్షల వివరాలను ఈ మూల్యాంకన పుస్తకంలో నమోదు చేసేందుకు ఏడాదంతా ఈ పుస్తకాన్ని ఉపాధ్యాయులు భద్రంగా ఉంచాలి. అయితే, గతంలో తెలుపు కాగితాలపై పరీక్షలు రాస్తే ఇంటికి తీసుకెళ్లి మూల్యాంకనం చేసేవారు. మార్కులు నమోదుతో పని పూర్తయ్యేది. ఇప్పుడు మూల్యాంకనం పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లే అవకాశం లేదు. వీటిని భద్రపరచడం తలకుమించిన భారమని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. ఏకపక్షంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల విద్యావ్యవస్థ గాడితప్పుతోందని విమర్శిస్తున్నాయి.

పాత పద్ధతే మేలు



ఎఫ్ఏ–1, 2, 3, 4 తో పాటు ఎస్ఏ–1, 2 పరీక్షల ఫలితాలను ప్రశ్న పత్రం మాదిరిగా మూల్యాంకన పుస్తకంలో నమోదుచేయడంతో ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. దీనికి అదనంగా పాఠశాలలో సమయం కేటాయించాల్సి వస్తోంది. ప్రభుత్వం ఈ పరీక్షల విధానాన్ని రద్దుచేసి పాత పద్ధతిలోనే నిర్వహించాలి.

– బోశెట్టి రామారావు, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి, వీరఘట్టం మండలం

పని ఒత్తిడి



ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా తీసుకువచ్చిన మూల్యాంకన పుస్తక విధానంతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఇప్పటికే బోధనేతర పనులతో సతమతమవుతున్న ఉపాధ్యాయులపై మూల్యాంకన పుస్తకాలు ఇచ్చి అదనపు భారం మోపడం పద్ధతికాదు. ప్రభుత్వం పునరాలోచన చేసి ఈ విధానాన్ని రద్దు చేయాలి.

– మజ్జి పైడిరాజు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

ఉపాధ్యాయుల్లో తీవ్ర వ్యతిరేకత ...

మూల్యాంకన పుస్తకాలపై ఉపాధ్యాయుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. విద్యార్థులకు ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో మూల్యాంకనం పుస్తకాన్ని ప్రభుత్వం ఇచ్చింది. ఆరు నుంచి 10వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి ఆరు మూల్యాంకన పుస్తకాలు అందాయి. ఫార్మేటివ్, సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను ఆ పుస్తకాల్లోనే విద్యార్థులు రాయాలి. పరీక్షలు రాసిన తర్వాత వాటిని దిద్ది అందులోనే ఉన్న ఓఎమ్మార్ షీట్‌లో మార్కులు వేయడంతో పాటు ఓఎమ్మార్ షీట్‌ను విద్యాశాఖ ఇచ్చిన యాప్‌లో ఉపాధ్యాయులు అప్‌లోడ్ చేయాలి.

సీతంపేట ఐటీడీఏ పీఓ ఎవరు?


సీతంపేట ఐటీడీఏ

సీతంపేట: సీతంపేట సమగ్ర గిరిజనాభ్యుదయ సంస్థకు (ఐటీడీఏ) ప్రాజెక్టుఅధికారి ఎవరనేది స్పష్టత లేదు. పాలకొండ సబ్‌కలెక్టర్‌గా విధులు నిర్వహించిన సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఇంతవరకు ఇన్‌చార్జ్ పీఓగా విధులు నిర్వహించారు. ఆయన బదిలీ అయ్యారు. పాలకొండకు కొత్త సబ్‌కలెక్టర్‌గా పవర స్వప్నిల్ జగన్నాథ్‌ను నియమించారు. ఇప్పటికే ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఐటీడీఏ పీఓగా ఆయనకు ఎటువంటి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించలేదు. మూడు రోజులు కావస్తున్నా ఐటీడీఏ పీఓ ఎవరనేది స్పష్టత లేదు. ఎటువంటి ఇన్‌చార్జిలు లేకుండా ఐటీడీఏ పీఓను శాశ్వతంగా నియమిస్తారా?, స్వప్నిల్ జగన్నాథ్‌కు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు ఇస్తారా అనేది చర్చనీయంశమైంది. సీతంపేట ఐటీడీఏకు పీఓ ఎవరనేదానిపై పూర్తిస్థాయిలో ఎవరికీ క్లారిటీ లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటి వరకు ఐటీడీఏకు శాశ్వతంగా పీఓను నియమించలేదు. ఇంచార్జిలతోనే నెట్టుకొస్తోంది.

బాధ్యత ఎవరు వహిస్తారు?

సీతంపేట ఐటీడీఏ పరిధిలో 20 సబ్‌ప్లాన్ మండలాలు ఉన్నాయి. నాలుగు మండలాలు పార్వతీపురం మన్యం జిల్లాలో ఉండగా, మరో 16 మండలాలు శ్రీకాకుళం జిల్లాలో ఉన్నాయి. సీతంపేట, కొత్తూరు, భామిని, హిరమండలం, మందస, మెళియాపుట్టి, పాతపట్నం మండలాలు ట్రైబల్ ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ (టీపీఎంయూ) విభాగంలో ఉన్నాయి. మొత్తం 1250కు పైగా గిరిజన గ్రామాలున్నాయి. 2 లక్షల మంది జనాభా ఉన్నారు. ఆయా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, క్షేత్రస్థాయిలో పథకాలు అమలు వంటివి చూడాల్సిన బాధ్యత ఐటీడీఏ పీఓపై ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిస్థాయిలో ఐటీడీఏ పీఓలను నియమించి పాలనా పరమైన ఇబ్బందులు లేకుండా చూసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఎటువంటి పాలకవర్గ సమావేశాలు సైతం నిర్వహించిన దాఖలాలు లేవు. ఐటీడీఏలను నిర్వీర్యమైపోయే స్థాయికి వచ్చాయని పలువురు గిరిజన నాయకులే ఆరోపిస్తున్నారు. చివరకు సీతంపేట ఐటీడీఏకు ఐటీడీఏ చైర్మన్ ఎవరనేది కూడా స్పష్టత లేదు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్, పార్వతీపురం మన్యం కలెక్టర్ వీరిద్దరిలో ఎవరనే సందిగ్ధం అధికారుల్లోనే ఉండడం కొసమెరుపు.

రెడ్‌బుక్ రాజ్యాంగం మాకొద్దు


- కూటమి పాలనపై విద్యార్థి సంఘాల ఆగ్రహం



ప్రభుత్వ తీరుకు నిరసనగా గుమ్మలక్ష్మీపురం మండలంలో విద్యార్థుల రాస్తారోకో (ఫైల్)

గుమ్మలక్ష్మీపురం: కూటమి ప్రభుత్వ చర్యలు విద్యార్థులు, ఉపాధ్యాయుల స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కులను హరించేలా ఉన్నాయి. విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలపై ప్రశ్నించే విద్యార్థి సంఘాలను నియంత్రించి, వారి గొంతును అణిచివేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. పాఠశాలల్లోకి రాజకీయ పార్టీల, విద్యార్థి సంఘాల నాయకులకు ప్రవేశాన్ని నిషేధిస్తూ జీఓ విడుదలచేయడం దుర్మార్గం. రాజ్యాంగం కల్పించిన హక్కులకు సంకెళ్లువేస్తూ నిరంకుశ పాలనను కొనసాగిస్తోంది. ఈ రెడ్‌బుక్ రాజ్యాంగం పాలన మాకొద్దంటూ విద్యార్థి సంఘాల నేతలు మండిపడుతున్నారు. ప్రభుత్వ తీరును దుయ్యబడుతున్నారు. విద్యను వ్యాపారంగా మార్చడం, వసతి గృహాల్లో నాసిరకమైన వసతులు, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్ల కోసం అధిక ఫీజు వసూళ్లు, అధిక ధరలకు పుస్తకాలు అమ్మడం, బకాయిపడిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలంటూ విద్యార్థి సంఘాలు ఆందోళన చేయడంతో ప్రభుత్వానికి భయంపట్టుకుందన్నారు. అందుకే నిషేధ ఉత్తర్వులతో సంకెళ్లు వేయాలని చూస్తోందన్నారు.


ఆంక్షలు దుర్మార్గం



ప్రభుత్వ బడుల్లో, సంక్షేమ హాస్టళ్లు/ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారమయ్యేందుకు విద్యార్థి సంఘాలు అనేక రకాల ఉద్యమాలు చేస్తూ విద్యార్థులకు మద్దతుగా నిలుస్తుంటాయి. ఆంక్షల పేరుతో విద్యా సంస్థల్లోకి అనుమతులు లేకుండా జీఓలు జారీ చేయడం దుర్మార్గం. సమస్యలు వెలుగులోకి రాకూడదనే ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తోంది.

– ఎ.గంగారావు, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి, గుమ్మలక్ష్మీపురం

ఉత్తర్వులు రద్దు చేయాలి



పాఠశాలలు, కళాశాలల ఆవరణలోకి విద్యార్థి సంఘాలకు అనుమతి నిరాకరిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు విద్యార్థుల హక్కులను కాలరాసేదిగా ఉంది. ప్రైవేటు విద్యను ప్రోత్సాహించేలా.. విద్యార్థి సంఘాల గొంతు నులిపేలా ఉన్న ఉత్తర్వులను ప్రభుత్వం రద్దు చేయాలి.

– బిడ్డిక అనీల్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి, కురుపాం